# సామాన్యుడి స్వర్గం

ఫస్టుతారీకు సాయంత్రం—

ఐదుగంటలు దాటింది!

ఆఫీసు గేటు దాటి రోడ్డుమీద కొచ్చాడు రావు.

సిమెంటు రోడ్డులాంటి అతన మనసులో సిటీబస్సులాంటి ఆలోచనన్లు...

పర్సు బైటికితీసి జీతంబాపతు కొత్తనోట్లను మరోసారి చూచుకుని తృప్తిగా నవ్వుకున్నాడు.

రేపు రెండవ తారీకు!!

మళ్ళీ 'ఫస్టు' ముప్ఫై రోజుల తర్వాతగానీ రాదు!

సరికొత్త ఆలోచన్లు రావు మెదడులో ఇవేళెందుకో దట్టంగా చిక్కుడు తీగెలా అల్లుకున్నాయి—

అతని పదేళ్ళ సర్వీసులో ఇలాంటి మొదటి తారీకులు యెన్నో సాదాగా దొర్లిపోయినయ్.

కానీ......

ఈ మొదటి తారీకు!

తల అడ్డంగా ఆడించాడు రావు!

ఆలోచనల్ని కూడదీసుకున్నాడు!!

పట్టా పుచ్చుకుని పదేళ్ళయినా ప్రాక్టీసు లేనివాడి ముఖంలా రేపనే రోజు ఎల్లాగూ వుంటుంది.

అందుకే ఈ రోజు అలా కాకూడదు.

ఈ రోజు జీవితంలో మరుపురాని రోజుగా అనుభవాల ఆనందంతో, నిండుగా దర్జాగా వెళ్ళమార్చాలి!!

నడుస్తూ 'ఆబిద్ సెంటర్' దాకా వచ్చాడు.

తలెత్తి ఆకాశంవేపు చూశాడు.

'ఆర్టీసీ' బస్సులాగ మేఘావృతమైన ఆకాశం గర్జించింది.

వర్షం రాబోతోంది -

చినుకులు పడ నారంభించాయి.

రావు శరీరంలో చలి ప్రారంభమైంది.

ఎదురుగా మూడంతస్తుల మేడమీద 'తెల్లగుర్రం' బొమ్మ వేసివున్న బోర్డు కన్పించింది. బొమ్మకిందుగా తాటి కాయలంత ఇంగ్లీషు అక్షరాలూ చదివేడు.

'వైట్ హార్సు' బొమ్మ కళ్ళబడేసరికి ఈ రోజు ఏమైనా సరే 'గుర్రం' ఎక్కాలన్పించింది. అందులోనూ తెల్లటి పంచకళ్యాణి గుర్రం!

ఈ ముప్ఫైఏళ్ళ జీవితంలో తాను ఏం సుఖపడ గలిగేడు? ఏ మానందించగలిగాడు?? -

అనుభవంలేని తను తెల్లగుర్ర మెక్కాలి! ఎల్లా? కళ్ళెం పట్టుకోవటమే చేతగాకపోతే?? -

నాన్నెన్నూ! షేమ్!!

'బార్' వేపు హుందాగా నడిచేడు రావు.

'నువ్వు కేవలం పదహారణాల గుమాస్తాగాడివి. అది మర్చిపోకు, గోతిలో పడకు...' అనే భావనతో బార్లో కూర్చున్న ఖరీదైన మనుష్యులందరూ తనవైపే చూస్తున్న ట్టనిపించింది.

అవును! తను సాదా మనిషి!!

స్వర్గం చూడగల స్తోమతలేక నరకయాతన అనుభ విస్తూ ఆశలన్నీ కరుడుగట్టుకున్న మనిషి!! అందునా కోరిక లేవీ వుండకూడని గుమాస్తా?!

సీట్లో కూర్చున్నాడు.

తెల్లగుర్రంమార్కు సీసాకి ఆర్డరిచ్చాడు.

ఇప్పుడు తనుకూడా గొప్ప అనుభవాల చరిత్రలోకి ఎక్కబోతున్నాడు.

స్వారీ చేయబోతున్నాడు.

తొలిసారి అనుభవం రావును గందరగోళ పెడుతోంది.

బైట ఉరుములు...మెరుపులు...

కార్కు ఓపెన్‌చేసి 'మందు' గాసులోకి వొంచు కున్నాడు.

తాగుడు అలవాటులేని తనవేపే అందరూ చూస్తు న్నట్టు గమనించాడు.

ఇవ్వేమీ అతనికి పట్టలేదు!

సీసా ఖాళీ చేశాడు!!

కళ్ళెం వొదిలాడు.

బిల్లు చెల్లించి 'బార్లో'ంచి బైటి కొచ్చాడు.

వాతావరణంలో ఈదురుగాలి ప్రవేశించింది. చలిగా వుంది.

చలిగాలికి వంట్లోవున్న వేడి చాలటంలేదు. రావు మనస్సు మరికొంచెం వెచ్చదనం కొరకు ఆరాటపడసాగింది.

అవును. ఇప్పుడు...ఈ ఆనందంలో, హాయిలో, మజాలో...

వెచ్చదనంలో మెత్తదనం కావాలి!

మెత్తదనంలో కొత్తదనం వుండాలన్పించింది!!

గొంతు మంటగా, నోరు తిమ్మిరిగా వుంది.

కంటిచూపును బలంగా పెద్దవిచేసుకుంటూ, వంకర్లు తిరిగిపోతున్న కాళ్ళను స్వాధీనపర్చుకుంటూ గతుకుల రోడ్డు మీద గుర్రబ్బండిలా నడుస్తున్నాడు రావు.

సరికొత్త సుఖంకావాలని వుబలాటపడుతున్న రావు ఆరాటం 'కొత్తవీధి' వైపు నడిచింది.

రావు చూపులకు ఆకాశం వంగినట్టు, భూమి తల్ల క్రిందు లవుతున్నట్టూ వుంది. వీధిలో కరెంటు దీపాలు తాగి జోగుతున్నట్టుగా వున్నయి.

రావు వాలకం కనిపెట్టిన ఒక పిల్లిగడ్డం పెద్దమనిషి వెంట నడుస్తున్నాడు.

ఏదో కావాలని అడిగేడు పెద్దమనిషి.

రావు కోరిక అవునని తలూపింది!

పదేళ్ళుగా కాపురం చేస్తున్న ఇరవై రూపాయల అద్దె కొంపలోకి రాలేదు రావు.

చింకి చొక్కాలతో, చీమిడిముక్కులతో పిల్లలు ఎదురు రాలేదు.

అయిపోయిన పాల డబ్బాలకేసి చూస్తూ ఏడిచే పసి వాడి రోదనయినా విన్పించలేదు.

మెరుపుతీగ రావు కళ్ళముందు నిలుచుంది.

మెలికలు తిరిగిపోతున్న రావు మంచంమీద వాలి పోయాడు.

మంచమా అది? ! - తను ఇన్నాళ్ళూ కాపురంచేసే కుక్కిమంచం కాదు.

ఖరీదైన పందిరిమంచం! మల్లెల పానుపు!!

మెరుపుతీగను పెనవేసుకున్నాడు రావు.

వళ్ళంతా కళ్ళుచేసుకుని మెరుపుతీగె ముఖంలోకి చూశాడు.

నిత్యమూ నైరాశ్యం చిందులుతొక్కే సునంద ముఖంలా లేదు......

అవి...పాలిపోయిన సునంద పెదవులూ కావు. కోర్కెలను చంపుకున్న సునంద చూపుల్లా లేవు.

ఆ హ్హా!

అందం, ఆకర్షణ, ఇంకా ఎన్నో రంగరించి తీర్చిదిద్దిన మెరుపుతీగె!

ఆమె రూపే కావాలి తనకు!!

అందుకే ధైర్యం చేశాడు.

మెరుపు తీగెను ముట్టుకునేసరికి 'కరెంట్ షాక్' లాంటి తిమ్మిరి, వెచ్చదనం, రావు శరీరంలోకి పాకిపోయాయి.

గొప్ప హేపీనెస్ అనుభవిస్తున్నాడు.

నిద్రలాంటి మత్తు...మత్తులాంటి నిద్ర ఆవరిస్తోంది. నోటికొచ్చిన మాటలేవో గొప్పగాచెప్పేస్తున్నాడు. తానొక 'సుల్తా' నన్నాడు.

మెరుపుతీగ కొక 'తాజమహాల్' కట్టిస్తా నన్నాడు.

మైకంలో...మత్తులో ... భ్రమలో ... బాధలనూ, కష్టాలనూ, అప్పులనూ, ప్రస్తుత ప్రపంచాన్నీ...అన్నీ మర్చి పోగలుగుతున్నాడు.

వెచ్చని కోరికల మధ్య తీయగా తెల వారింది!

మెరుపుతీగ ఇంటి తలుపులు రావుకి 'సెండాఫ్' ఇచ్చాయి.

రోడ్డుమీద కొచ్చాడు!

రావు మనసంతా వెలితితో నిండుకుంది.

ఏదో తీరని...ఆరని అసంతృప్తి ఆవరించింది.

మళ్ళీ ఆలోచన!

నడుస్తున్నాడు.

ప్రస్తుతం గుర్తొచ్చేసరికి తనమీద తనకే అసహ్యం, ఈసడింపు, దిగులు....రోదన...

ఇరవై రూపాయల అద్దె ఇంటివైపు నడుస్తున్నాడు.

చింపిరితల, చినిగిన చొక్కాలు, చీమిడిముక్కులతో మెదు రమ్యే పిల్లలమధ్యకు వెడుతున్నాడు. పదహారణాల గుమాస్తా జీవితం నవ్వుతోంది.

సిగ్గేసింది! భయమేసింది!!

చాలినా చాలకపోయినా నవ్వుముఖంతో జీతం ఇంటికి తీసుకెళ్ళాల్సిన తను?!...

ఖాళీజేబుతో, జీర్ణమైన ఆనందంతో కుంచించుకు పోయే మనస్సుతో నిర్జీవంగా వెడుతున్నాడు.

తన బ్రతుకెంత? తాహతేమిటి?

అందరినీ గాలికి వదిలేసి...కడుపులు మాడ్చుకోమని తను క్షణికమైన ఆనందానికి పాల్పడ్డాడు.

ఎంత పాపిష్ఠివాడు! కాదు కసాయివాడు!! కానేకాడు స్వార్థపరుడు!!!

ఎన్నడూ లేని స్వార్థం తనలో యెందుకు ప్రవేశించింది? ఎట్లా లొంగదీసుకుంది? బరువు బాధ్యతను విస్మరించి స్వార్థానికి యెందుకు తను తలపడట్టు??

తాను చేసిన పాపిష్ఠిపని తననే అవమానిస్తున్నట్టుంది.

సునందకు తన ముఖం చూపటం యెట్లా? ఆకలికడుపుతో అలమటించే పిల్లలను సముదాయించే దెట్లా?? అప్పులవాళ్ళ నెట్లా సమాధానపరిచేట్టు? మళ్ళీ మొదటి తారీకు దాకా యెట్లా బ్రతికేట్టు?? -

భయం!

ఇలాంటి వెధవపనిచేసి తిరిగి మళ్ళీ ఇంటికి వెళ్ళకపోతే నేం అన్పించింది.

చచ్చిపోవా లన్పిస్తోంది.

అమ్మో?-!...

మరోరకమైన భయం!

గుండెదడ హెచ్చింది.

చావుద్వారా మళ్ళీ స్వార్థాన్నే కోరుతున్నాడు.

పిచ్చెక్కేట్టుంది.

గుండె ఆగిపోతే బావుండు నన్పించింది.

పిరికితనం!

నడుస్తున్న రావు కాళ్ళు ఇంటిముందుకొచ్చి ఆగేయి.

తలుపుతీసిన సునంద ముఖంలోకి ధైర్యంగా, సూటిగా చూడలేకపోయాడు.

ఏడుపొచ్చింది.

నేరస్తుడిలాగ నిల్చున్నాడు.

'లోపలికి రండి' అనే భార్య పిలుపులోవున్న తియ్యదనం రావు గుండెను చీల్చివేసింది.

తాను ఊహించిన కోపం, అసహ్యం, బాధ యివేమీ భార్య ముఖంలో అవుపించలేదు.

సునంద ముఖంలో చిరునవ్వు చూచి ఆశ్చర్య పోయాడు.

భార్య నవ్వులో వేయి మెరుపుతీగెలను మించిన ఆదరణ, ఆప్యాయత, తియ్యదనం అవుపించాయి.

ఆ నవ్వులో ఖరీదు కట్టలేని అభిమానం, ఆత్మీయత నిండుగా వున్నాయి.

ఆ చూపులో అసురాగం...అంతకు మించిన స్వర్గం కన్పించింది.

భార్య చేతిస్పర్శతో కోటి ఆనందాల మేళవింపు వుందని గ్రహించాడు.

అన్నిటికీ కట్టుబడి కదల్లేని రావు సిగ్గుపడుతూ తప్పు చేసిన వాడిలా తలవంచుకొని అడుగులో అడుగేస్తూ ఇంట్లోకి నడిచాడు. ఇప్పుడన్పించింది, ఇది ఇల్లుకాదు.... స్వర్గమని.